www.bhadradrinews.com

# భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily | గురువారం 27,ఆగస్టు, 2026



# అవినీతి వ్యవసాయం

- అనుమతుల మాటున వసూళ్ల పర్వం
- రెన్యువల్ టైం లోనూ చేతులు తడపాల్సిందే
- చుట్టపు చూపుగా విధులు
- వసూళ్లపరంగా మహాముదురు
- వ్యాపారులకు అనుకూలంగా అడుగులు
- రైతు సేవల పట్ల అంటీ ముట్ట నట్లు
- పేరుకు వ్యవసాయాధికారి
- పనితీరులో నిర్లక్ష్య వైఖరి
- సంతకాన్ని సైతం తాకట్టు పెట్టేస్తాడు
- ములుగు జిల్లా వ్యవసాయ శాఖలో జాక్ పాట్ ఏ ఓ




6వ పేజీలో...

అన్నదాతల అవస్థలు పట్టించుకోవాల్సిన ఓ వ్యవసాయ అధికారి నిర్లక్ష్యానికి కేరాఫ్ అడ్రస్ గా పనిచేస్తున్నారు. రైతుల సమస్యల కన్నా అనైతిక రాబడు లపై దృష్టి పెట్టిన అధికారి ఆ దిశగా వేస్తున్న అడుగులు ఆయన అవినీతి తీరు కు నిదర్శనం గా నిలుస్తున్నాయి.. మండలంలో వ్యవసాయ అభివృద్ధికి తోడ్పాటు అందించాల్సిన ఆ ఏవో వసూళ్ల రారాజుగా  వెలుగొందుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి

**భద్రాద్రి న్యూస్/ స్పెషల్ ఫోకస్ :**

## ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలను నిర్వహించాలి



3లో

జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్

గణేష్ నిమజ్జనం సందర్భంగా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలి

వినాయక విగ్రహాల తరలింపు సమయంలో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలి

కాల్వొడ్డు మున్నేరు, ప్రకాష్నగర్, తీర్థాల వద్ద గణేష్ నిమజ్జనం ప్రాంతాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్

## రూ.4.46 కోట్లతో అభివృద్ధి జాతర



8లో

- గ్రామాభివృద్ధి లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం అడుగులు
- వ్యవసాయ మార్కెట్ యార్డుల అభివృద్ధికి 3 కోట్ల 11 లక్షల రూపాయలు
- శివాపూర్, గోగుపల్లిలో కోటి 35 లక్షల రూపాయలతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైన్లు ప్రారంభం
- ప్రారంభోత్సవాలు శంకుస్థాపనలతో మంత్రి దనసరి అనసూయ సీతక్క, బిజీ బిజీ

భద్రాద్రి న్యూస్
గురువారం 27,ఆగస్టు, 2026

# పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న బెల్ట్ షాపులు..



**-పల్లెల్లో మద్యం ఏరులై పారుతోంది**
**- ఏ పల్లె కు వెళ్లిన బెల్ట్ షాపుల దందా**
**-పట్టించుకోని సంబంధిత అధికారుల**
**- ఇకనైనా చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్**

**చంద్రుగొండ/జూలూరుపాడు (భద్రాద్రి న్యూస్) ప్రతినిధి:**
పల్లెల్లో బెల్ట్ షాపులో పుట్టగొడుగుల పుట్టుకొస్తున్నాయి అధికారుల నిర్లక్ష్యం వల్ల మద్యం మాఫియా గల్లీకో బెల్టు షాపు ఏర్పాటు చేస్తూ అందిన కాడికి దండుకుంటున్నారుమండల కేంద్రాలతో పాటు గ్రామాలలో విచ్చలవిడిగా బెల్టు షాపులను నిర్వహిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు కన్నెత్తి చూడకపోవడంపై పలు విమర్శలు దారితీస్తుంది
అక్రమ బెల్ట్ షాపులు రాజ్యమేలుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.....

**కిరాణా దుకాణాలకు పోటీగా..**
గ్రామాలలో నిత్యావసర వస్తువుల కొనుగోలు కోసం కిరాణా షాపులు పదుల సంఖ్యలో ఉంటాయి.గతంలో అక్రమ బెల్ట్ షాపులు అరకొర ఉండేవి.ప్రస్తుతం పెరుగుతున్న జనాభా కనుగూనంగా వివిధ రకాల దుకాణాలు వెలుస్తుండగా మద్యం సేవించడానికి పెద్దలకు దీటుగా యువత అలవాటు పడడంతో గ్రామాలలో కిరణా కొట్లకు మించి బెల్ట్ షాపులు దర్శనం ఇస్తున్నాయి ప్రతిరోజు తెల్లవారకముందే వాటిని తెరిచి అర్ధరాత్రి వరకు ఎలాంటి నియంత్రణ లేకుండా నిర్వహిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.కొందరు మద్యానికి బానిస అయిన వారు టీ కి బదులు వేకువజామునే మద్యం సేవిస్తున్నారు. దీంతో పల్లెటూరి వాతావరణం సైతం దెబ్బతింటుందని ప్రజలు వాపోతున్నారు.

**యువత మద్యానికి బానిస...**
గ్రామాలలో విచ్చలవిడిగా మద్యం అందుబాటులో ఉండడంతో మద్యానికి బానిస అయిన వారితో పాటు యువత సైతం మద్యానికి ఆకర్షితులవుతూ క్రమంగా బానిస అవుతున్నారు.
రోజువారి కూలీలు, నిరుపేద కుటుంబాలకు చెందిన పెద్దలు బానిసలుగా మారి అధికంగా మద్యం సేవిస్తూ తమ ఆరోగ్యాలను చెడిపోవడంతో పాటు జేబులను గుల్ల చేసుకుంటూ అప్పుల పాలవుతున్నారు.
మద్యం సేవించిన మందు బాబులను చూసి రోడ్లపై ఒంటరి మహిళలు, యువతులు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. చిన్నారులు,విద్యార్థినీ, విద్యార్థులు కూడా ఈ పరిస్థితుల కారణంగా తమ పనుల కోసం వెళ్లేందుకు సైతం జంకుతున్నారు.అక్రమ మద్యం అతిగా మద్యం సేవిస్తూ రాత్రి వేళల్లో గొడవలు గందరగోల పరిస్థితిలు ఏర్పడుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇంత జరుగుతున్న సంబంధిత అధికారులు తెలిసి తెలియనట్టుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.
ఇప్పటికైనా పోలీస్ శాఖ,ఆబ్కారీ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి గ్రామాలలో కొనసాగుతున్న అక్రమ మద్యం దందాను అరికట్టాలని..అక్రమంగా వెలిసిన దుకాణాలను తక్షణమే సీజ్ చేసి నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రజల ప్రశాంత జీవనానికి భంగం కలిగిస్తున్న ఈ అక్రమ వ్యాపారం పై అధికారులు వెంటనే స్పందించాలని కోరుతున్నారు..

# వివాహ ప్రధానం కార్యక్రమంలో పాల్గొన్న మల్లి బాబు యాదవ్



**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 26 (భద్రాద్రిన్యూస్ ):-**
వైరా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ల గంగారావు - శైలజయాదవ్ ల కూతురు మౌనిక- హరికృష్ణ( వేంసూరు మండలం అడవి రామన్నపాలెం గ్రామానికి చెందిన శ్రీనివాసరావు మహాలక్ష్మి ల కుమారుడు) ల వివాహం రేపు జరగనున్న సందర్భంగా బుధవారం నాడు జరిగిన వివాహ ప్రధానశీ కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్ అఖిలభారత యాదవ మహాసభ జిల్లా గౌరవ అధ్యక్షులు మేకల మల్లిబాబు యాదవ్ ప్రధాన కార్యక్రమంలో పాల్గొని కలకాలం చల్లగా, అన్యోన్య దాంపత్యంతో సుఖ జీవనంతో, సంతోషంగా ఉండాలనినూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా అక్కడికి చేరుకున్న యాదవులు అడిగిన వాటికి సమాధానంగా యాదవులు రాజకీయంగా చైతన్యం కావాలంటే ముఖ్యంగా యాదవులు ఐక్యత భావం కలిగి ఉండాలని, యాదవుల అభివృద్ధి కోసం జరిగే కార్యక్రమాలకు రాజకీయాలు వర్గాలకతీతంగా పాల్గొంటే మన హక్కులు మనం సాధించుకోవడానికి అదొక అవకాశం గా మలుచుకోవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి మెంబర్ పుచ్చకాయల వీరభద్రం, అఖిలభారత యాదవ జిల్లా మహాసభ యాదవ యువజన అధ్యక్షులు చిత్తారు సింహాద్రి యాదవ్, దుబాకుల శ్రీనివాసులు యాదవ్, మూడు ముంతల గంగరాజు, గజ్జి సూరిబాబు, వెంకటనారాయణ, నరేష్, రామారావు,మరియు, బంధువులు ,తదితరులు పాల్గొన్నారు.

# సేవకు ప్రతిరూపం.. మదర్ థెరిసాకు త్రివేణి నివాళి

**-మానవత్వమే మహోన్నత సేవగా చాటిన మహనీయురాలు**



**ఖమ్మం ప్రతినిధి , ఆగస్టు 26 (భద్రాద్రిన్యూస్):**
మదర్ థెరిసా జయంతిని పురస్కరించుకుని త్రివేణి స్కూల్స్, ఖమ్మం శాఖలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు మదర్ థెరిసా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. డైరెక్టర్ డా. గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ, మదర్ థెరిసా సేవా భావం, కరుణ, మానవత్వానికి ప్రపంచానికి ఆదర్శంగా నిలిచాయని అన్నారు. ఆమె చూపిన సేవా మార్గం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ శ్రీ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, మదర్ థెరిసా జీవితంలోని దయ, సేవ, త్యాగం వంటి విలువలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. సమాజంలో అవసరంలో ఉన్నవారికి అండగా నిలవడమే ఆమెకు అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్స్ స్వప్న, ముస్తఫా,సిఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ,క్యాంపస్ ఇంచార్జ్ విక్టర్ చార్లెస్, ట్రాన్స్పోర్ట్ ఇంచార్జ్ సందీప్ ఉపాధ్యాయినీ - ఉపాధ్యాయుల పాల్గొని థెరిసా సేవలను స్మరించుకున్నారు.

# "సే నో టు డ్రగ్స్" నినాదంతో బిఎస్ఎఫ్ఐ అవగాహన కార్యక్రమాలకు శ్రీకారం




**ఖమ్మం ప్రతినిధి , ఆగస్టు 26 (భద్రాద్రిన్యూస్ ):-**
మాదకద్రవ్యాల బారిన పడుతున్న యువత, విద్యార్థులను చైతన్యపరిచి వారి ఉజ్వల భవిష్యత్తును కాపాడాలనే లక్ష్యంతో బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (బి ఎస్ఎఫ్ఐ) ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో "సే నో టు డ్రగ్స్" అవగాహన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది.ఈ సందర్భంగా బిఎస్ఎఫ్ఐ ప్రతినిధులు ఖమ్మం జిల్లా పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ని కలిసి విద్యార్థులు, యువత ఎదుర్కొంటున్న నష్టాలను వివరించారు. అనంతరం డ్రగ్స్కు వ్యతిరేకంగా రూపొందించిన అవగాహన పోస్టర్ను సిపి సునీల్ దత్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బిఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు కర్ల ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ... మాదకద్రవ్యాల వినియోగం విద్యార్థుల ఆరోగ్యం, చదువు, కుటుంబ సంబంధాలు, వ్యక్తిత్వం, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందని అన్నారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేలా పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లు వివిధ కోచింగ్ సెంటర్స్ లో యువతీ యువకులకు, విద్యార్థులకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని తెలిపారు.

**-"డ్రగ్స్ కాదు... విద్య కావాలి: డ్రగ్స్ కాదు... మంచి భవిష్యత్తు కావాలి"**
అనే నినాదంతో విద్యార్థుల్లో చైతన్యం తీసుకురావడానికి బిఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు, ప్రచార కార్యక్రమాలు, ప్రతిజ్ఞ కార్యక్రమాలు, క్యాంపస్ అవేర్నెస్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు ఆకర్షితులు కాకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పోలీసులు, విద్యార్థి సంఘాలు, సమాజంలోని ప్రతి ఒక్కరూ కలిసి పనిచేయాలని బిఎస్ఎఫ్ఐ విజ్ఞప్తి చేసింది. "డ్రగ్స్కు నో చెప్పండి: విద్యకు, ఆరోగ్యానికి, జీవితానికి అవును ఎస్ అని చెప్పండి" అని బిఎస్ఎఫ్ఐ ఖమ్మం జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమంలో (బి ఎస్ఎఫ్ఐ) ఖమ్మం జిల్లా అధ్యక్షులు దాసరి రాజశేఖర్, జిల్లా ఉపాధ్యక్షులు చిలుముల అజయ్, జిల్లా కార్యవర్గ సభ్యులు గద్దల నాగరాజు, జిల్లా మహిళా కన్వీనర్ మరికంటి స్పందన, కో-కన్వీనర్ మడప ధనలక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు జి. గోపి, సిహెచ్.కిషోర్, కోలా సతీష్ తదితరులున్నారు.

# బీసీ మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీకి దరఖాస్తుల ఆహ్వానం

**సెప్టెంబర్ 13లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి**
**బి. రామ్మోహన్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి**
**భద్రాద్రి న్యూస్ ములుగు జిల్లా**
వెనుకబడిన తరగతులకు చెందిన మహిళలకు స్వయం ఉపాధి కల్పించి, ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు కుట్టు మిషన్లను అందించనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి బి. రామ్మోహన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 2026--27 ఆర్థిక సంవత్సరానికి కుట్టు మిషన్ల పంపిణీ పథకాన్ని అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. 18 నుంచి 45 సంవత్సరాల వయస్సు కలిగి, తెలంగాణ రాష్ట్రానికి చెందిన అర్హులైన బీసీ మహిళలు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు అవసరమైన ధ్రువపత్రాలతో ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుల సమర్పణకు సెప్టెంబర్ 13 చివరి తేదీ అని, గడువు ముగిసిన అనంతరం వచ్చిన దరఖాస్తులను స్వీకరించబోమని స్పష్టం చేశారు.అర్హులైన బీసీ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, కుట్టు మిషన్ ద్వారా స్వయం ఉపాధి పొందాలని బి. రామ్మోహన్ కోరారు.

భద్రాద్రి న్యూస్

గురువారం 27,ఆగస్టు, 2026

# కెసిఆర్ ని ముఖ్యమంత్రిని చేసేవరకు ప్రతి బిఆర్ఎస్ సైనికుడు కసిగా పని చెయ్యాలి

**-కష్టపడి పని చేసేవారిని పార్టీ ఎప్పటికీ మర్చిపోదు**
**-అక్రమ కేసులకు బిఆర్ఎస్ భయపడదు.**
**-మండలంలో మాజీ ఎమ్మెల్యే మెచ్చా పర్యటన**
**- బిఆర్ఎస్ పార్టీ నాయకుల్లో నూతన జోష్**

**చంద్రుగొండ/ జూలూరుపాడు (భద్రాద్రి న్యూస్) ప్రతినిధి:**
కెసిఆర్ ని ముఖ్యమంత్రి చేసే వరకు ప్రతి కార్యకర్త సైనికుల పని చేయాలని బిఆర్ఎస్ నియోజకవర్గం ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే మెచ్చ నాగేశ్వరావు అన్నారు బుధవారం మండలంలో ఆయన విస్తృతంగా పర్యటించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడి పార్టీ కోసం పనిచేసే కార్యకర్తను టిఆర్ఎస్ పార్టీ ఎప్పటికీ మర్చిపోదని అన్నారు. మొదటగా మద్దుకూరు గ్రామంలోని అయ్యప్పస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అనంతరం మద్దుకూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన బిఆర్ఎస్ పార్టీ దిమ్మపై పార్టీ జెండాను ఎగరవేసి దిమ్మను ఆవిష్కరించారు.అనంతరం గ్రామ పార్టీ కార్యాలయ నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టారు.గ్రామ పార్టీ కార్యాలయ ఏర్పాటు కొరకు స్థలం ఇచ్చిన మంచినేని వెంకటేశ్వరరావు శాలువాతో సత్కరించారు.

అనంతరం రావికంపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన బిఆర్ఎస్ పార్టీ దిమ్మపై పార్టీ జెండాను ఎగరవేసి దిమ్మను ఆవిష్కరించారు ఈ సందర్భంగా అయిన మాట్లాడుతూ మళ్ళీ కేసీఆర్ ని ముఖ్యమంత్రిని చేసే వరకు ప్రతి ఒక్కరూ కసిగా పని చెయ్యాలని. కష్టపడి పని చేస్తున్న ఏ ఒక్కరిని పార్టీ మర్చిపోదని.ప్రతి ఒకరిని కంటికి రెప్పలా కాపాడుకుంటానని ఏ క్షణం రామన్న వస్తానని హామీ ఇచ్చారు.గ్రామాలు అభివృద్ధి అవ్వాలంటే కెసిఆర్ మళ్ళీ రావాలని గ్రామాల్లో ప్రజలు చర్చించుకుంటున్నారని.అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రతి ఒకరిని మోసం చేసిందని అన్నారు, సెప్టెంబర్ 2 నుంచి వారం రోజుల పాటు బాకీ కార్డులతో గ్రామాల్లో ప్రజలకు కాంగ్రెస్ చేసిన మోసాలను





వివరించే కార్యక్రమం చేపట్టాలని కెటిఆర్ పిలుపు ఇచ్చిన సందర్భంగా నాయకులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాలని వారు చేసిన మోసాలను ప్రజలకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.పార్టీ ఇచ్చే ప్రతి పిలుపును,పార్టీ బలోపేతం కోసం అహర్నిశలు కష్టపడుతున్న జిల్లా బిఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు రేగ కాంతారావు ని రాజకీయంగా ఎదుర్కోలేక వారి ప్రతిష్ఠను దిగజార్చాలనే దుర్మార్గపు ఆలోచనతో అబద్ధపు కేసు పెడితే.న్యాయస్థానం అది అబద్ధపు కేసని కొట్టేసిందని అన్నారు నిజం ఎప్పటికీ గెలుస్తుందని.ఎన్ని ఇబ్బందులు పెట్టాలని చూసినా రేపు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రేగ కాంతారావు నాయకత్వంలో 5 నియోజకవర్గాల్లో గులాబీ జెండా ఎగరడం ఖాయమని దీమ వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో చంద్రుగొండ మాజీ మండల అధ్యక్షులు దారా బాబు,బోయినపల్లి సుధాకర్ రావు,మాజీ జెడ్.పి.టి.సి. వెంకట రెడ్డి,సర్పంచ్ లు కృష్ణ కుమారి, గూగులోత్ ప్రవీణ్ ప్రకాష్, మాజీ సర్పంచ్లు పుసం వెంకటేశ్వర్లు,పండ్ల అంజన్ రావు,ఉప సర్పంచులు బానోత్ బాలు,శీలం రమేష్ రెడ్డి,శ్రవణ్ కుమార్,నల్లమోతు వెంకట నారాయణ,మేడ మోహన్ రావు,కొత్తూరు వెంకటేశ్వరరావు, భూపతి రమేష్,ఉన్నం నాగరాజు,ఉగ్గం శ్రీను,గానుగపాడు వైస్ చైర్మన్ భూపతి ధన లక్ష్మీ,భూపతి శ్రీను,శారద,అశ్విని,కనకమలక్ష్మీ,కంపాటి రాధమ్మ, బీరకాయల వెంకటేశ్వర్లు,మద్దిరాల చిన్న పిచ్చయ్య, సానిక మల్లేష్,పొట్రు అప్పారావు,ఆదిమళ్ల సత్యనారాయణ, చల్లా రాంబాబు,కెలోత్ శ్రీను,చాపలమడుగు రామరాజు,బాద్షా,హనుమంత్ రావు,పొట్రు మధు,ఉప్పతల గణేష్,బానోత్ రాజ్ కుమార్,పల్లె వీరప్రసాద్, తాల్లా వెంకట రత్నం,గాంధీ, పద్దం కృష్ణ,నరసింహా రావు,మహేష్,కంపాటి అశోక్,ఓరుగంటి శ్రీను,పండ్ల కిరణ్, కోడెం రాంబాబు,మంద అనిల్,రమేష్,కుక్కల రంగయ్య,గాలం రవి,బుద్దేశ్వరరావు,వెంకటేశ్వరరావు, మాచిని సురేష్,రమేష్,ముత్యం,రామకృష్ణ,అబ్బాస్ అలీ,ముత్తయ్య, సయ్యద్ హుస్సేన్,సయ్యద్ పాషా,రాధాకృష్ణ,భుక్య అధ్య,భూక్యా వెంకటేష్,బాధవత్ వెంకటేష్,భూక్యా బద్రు,అల్లభాగత్,కరిముల్లా, సైదా, జాన్ పాషా,ఆసిఫ్,నాగుల్ మీరా,కలిశా, రఫీ,అశోక్, సాదిక్, జాఫర్, తదితరులు ఉన్నారు.

# త్వరలో బీఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు

**ఖమ్మం జిల్లాలో పార్టీ బలోపేతంపై మాజీ మంత్రి పువ్వాడ వ్యూహం**

**ప్రధానంగా ఖమ్మం, వైరా నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి**

**మాజీ సుడా ఛైర్మన్ బచ్చు విజయ్ కుమార్**

**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 26( భద్రాద్రిన్యూస్ ):-**



ఖమ్మం జిల్లా ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో అసంతృప్తి నెలకొని ఉందని మాజీ సుడా ఛైర్మన్ బచ్చు విజయ్ కుమార్ అన్నారు. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ నాయకత్వంలో ముఖ్యంగా ఖమ్మం, వైరా నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ పార్టీలో చేరేందుకు ఇతర పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు.

చేరికలపై ఇప్పటికే దృష్టి సారించామని, సరైన సమయంలో దీనిపై నిర్ణయం తీసుకుంటామని కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని అన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై అసంతృప్తిగా ఉన్న నాయకులు, కార్యకర్తలను బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. త్వరలోనే ఇతర పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరనున్నారని వెల్లడించారు.

ఖమ్మం జిల్లా వ్యాప్తంగా పార్టీ బలోపేతంపై మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ప్రత్యేక దృష్టి సారించారని అన్నారు. పకడ్బందీ వ్యూహంతో ముందుకు సాగుతూ తన రాజకీయ చతురతతో బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ కృషి చేస్తున్నారని తెలిపారు.

రాబోయే రోజుల్లో ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ మరింత బలపడుతుందని, పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరే అవకాశం ఉందని మాజీ సుడా ఛైర్మన్ బచ్చు విజయ్ కుమార్ పేర్కొన్నారు.

# ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలను నిర్వహించాలి



**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు-26 (భద్రాద్రిన్యూస్ ):**
ప్రశాంతమైన వాతావరణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకునేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ అన్నారు. ప్రజలకు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించేందుకు ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని సూచించారు. ఖమ్మం రూరల్ మండలం తీర్థాల వద్ద ఆకేరు నది పరిసరాల్లో వినాయక విగ్రహాల నిమజ్జనానికి అనువైన ప్రదేశం, నీటి మట్టం, రహదారి మార్గాలు, వాహనాల రాకపోకలకు సంబంధించిన ఏర్పాట్లను బుధవారం కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, పోలీసు అధికారులు, స్తంభాద్రి ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి ఖమ్మం నగరంలోని కాల్వొడ్డు మున్నేరు, ప్రకాష్‌నగర్ వద్ద నీటి మట్టాన్ని, గణేష్ నిమజ్జనానికి ఉన్న అవకాశాలను పరిశీలించారు. భక్తుల మనోభావాలకు అనుగుణంగా అవసరమైన మౌళిక సదుపాయాలు కల్పించడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, నిమజ్జనం ప్రదేశాలను సమగ్రంగా పర్యవేక్షించి ప్రజలకు అనువుగా తుది నిర్ణయాలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ...వినాయక చవితి నుంచి నిమజ్జనం వరకు ఉత్సవాలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు.

**నిమజ్జనం పాయింట్ల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలి**

గణేష్ నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, తగినంత లైటింగ్, బ్యారికేడ్లు, తాగునీటి సరఫరా, మొబైల్ టాయిలెట్లు తదితర సౌకర్యాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. నిమజ్జనం సమయంలో ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని అన్నారు.

నిమజ్జనం పాయింట్ల వద్ద గజ ఈతగాళ్లను, ఎస్డిఆర్ఎఫ్ బృందాలను ముందుగానే అందుబాటులో ఉంచాలని, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు అవసరమైన రక్షణ పరికరాలు, సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని సూచించారు. నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో నీటి లోతు, ప్రవాహ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.

నిమజ్జనం సందర్భంగా ట్రాఫిక్ రద్దీ ఏర్పడకుండా వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించాలని, ప్రధాన మార్గాల్లో పోలీసు సిబ్బందిని అందుబాటులో ఉంచాలని అన్నారు. భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

ప్రజలు, ఉత్సవ కమిటీలు సహకరించి, ప్రశాంత వాతావరణంలో గణేష్ నిమజ్జనం నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ స్వీయ నియంత్రణ, సంయమనం పాటించాలని కలెక్టర్ కోరారు. ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసు, రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్, విద్యుత్ తదితర శాఖల అధికారులతో పూర్తి స్థాయిలో సమన్వయంతో సహకరించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట అడిషనల్ ఎస్పీ అడ్మిన్ రామాంజనేయులు, ఇరిగేషన్ సీఈ వసంతి, ఎస్ఈ ఎం. వెంకటేశ్వర్లు, ఏసిపి లు రమణమూర్తి, తిరుపతిరెడ్డి, ఏదులాపురం మున్సిపల్ కమిషనర్ ఏ. శ్రీనివాస రెడ్డి, ఖమ్మం అర్బన్ మండల తహసీల్దార్ జయచందర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి న్యూస్
తెలుగు దినపత్రిక
గురువారం 27,ఆగస్టు, 2026

## సంప్రదాయ సొబగులతో ఘనంగా 'హార్వెస్ట్'లో ఓనం వేడుకలు





**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 26 (భద్రాద్రిన్యూస్ ):-**
భారతీయ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని తెలియజేస్తూ నేడు హార్వెస్ట్ పాఠశాలలో ఓనం వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేరళ రాష్ట్రానికి చెందిన ఈ పంటల పండుగను పాఠశాల ఆవరణలో ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. సంప్రదాయ కేరళ దుస్తుల్లో ముస్తాబై వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పూలతో రూపొందించిన అందమైన పూక్కలం అందరినీ ఆకట్టుకుంది. కేరళ ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు ఓనం ప్రాముఖ్యతను తెలియజేస్తూ ప్రసంగాలు, పాటలు, నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. కేరళ సంప్రదాయ కళారూపాలను ప్రతిబింబించే కార్యక్రమాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. పాఠశాల ఆవరణ మొత్తం పండుగ వాతావరణాన్ని తలపించింది.

ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండెంట్ పి.రవిమారుత్ మాట్లాడుతూ, "ఓనం పండుగ కేరళ ప్రజల సాంస్కృతిక జీవన విధానాన్ని ప్రతిబింబించే ఒక గొప్ప పండుగ. ఇది ప్రకృతికి కృతజ్ఞతలు తెలియజేయడంతో పాటు, కుటుంబ సభ్యులు, స్నేహితులు, సమాజంలోని ప్రతి ఒక్కరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చే పండుగ. పండుగల అసలు ఉద్దేశం కేవలం ఆనందాన్ని పొందడం మాత్రమే కాదు; వాటి వెనుక ఉన్న మానవీయ విలువలు, సంప్రదాయాలు, ఐక్యత, సోదరభావం వంటి సందేశాలను తరువాతి తరాలకు అందించడం. విద్యార్థులు భారతదేశంలోని వివిధ సంస్కృతులను గౌరవించడం, ఇతరుల సంప్రదాయాలను తెలుసుకోవడం ఎంతో అవసరం. విద్యార్థుల్లో విద్యతో పాటు సంస్కృతి, విలువలు, సృజనాత్మకతను పెంపొందించడానికి మా పాఠశాల ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుంది. ఈరోజు ఓనం వేడుకల్లో ఉపాధ్యాయులు చూపిన ప్రతిభ, ఉత్సాహం అభినందనీయం. ఈ ఓనం ప్రతి కుటుంబంలో ఆనందం, ఆరోగ్యం, శాంతి, సౌభ్రాతృత్వాన్ని నింపాలని కోరుకుంటున్నాను" అని తెలియజేశారు.

పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీమతి ఆర్. పార్వతీ రెడ్డి మాట్లాడుతూ, "ఓనం పండుగ మనకు ప్రేమ, సమానత్వం, ఐక్యత, సంతోషం మరియు పరస్పర గౌరవం వంటి గొప్ప విలువలను నేర్పుతుంది. మహాబలి చక్రవర్తి కథతో ముడిపడిన ఈ పండుగ ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలనే గొప్ప సందేశాన్ని అందిస్తుంది. విద్యార్థులు వివిధ రాష్ట్రాల పండుగలు, ఆచారాలు, సంప్రదాయాలను తెలుసుకోవడం ద్వారా భారతదేశంలోని సాంస్కృతిక వైవిధ్యాన్ని అర్థం చేసుకుంటారు. ఇటువంటి కార్యక్రమాలు మనలో ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత, బృందస్ఫూర్తి మరియు నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయి. పాఠశాలలో ఓనం వేడుకలను నిర్వహించడం ద్వారా విద్యార్థులకు ఒక కొత్త సంస్కృతిని పరిచయం చేయడంతో పాటు, అందరం కలిసి ఆనందాన్ని పంచుకోవాలి, ఒకరినొకరు గౌరవించాలి అనే సందేశాన్ని అందించగలిగాం. విద్యార్థులు, ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు అభినందనలు" అని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. "ఓనం అందరి జీవితాల్లో ఆనందం, ఐక్యత, శ్రేయస్సును నింపాలి" అనే ఆకాంక్షతో వేడుకలు ఘనంగా ముగిశాయి.

## పాల్వంచలో ఘనంగా ఈద్ మిలాద్ ఉన్ నబీ శాంతి ర్యాలీ





**పాల్వంచ, ఆగస్టు 26( భద్రాద్రిన్యూస్ ):**
మహా ప్రవక్త మొహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం జన్మదినాన్ని పురస్కరించుకొని మర్కజి జామా మసీదు అహ్లె సున్నత్ వల్జమాత్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం పాల్వంచలో భారీ శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక నటరాజ్ సెంటర్‌లోని జామా మసీదు నుంచి ప్రారంభమైన ర్యాలీ మార్కెట్ ఏరియా, బస్టాండ్ సెంటర్, అంబేద్కర్ సెంటర్ మీదుగా తిరిగి నటరాజ్ సెంటర్‌లోని జామా మసీదుకు చేరుకుంది. ఈ ర్యాలీలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం, ఇల్లందు, రామవరం, మణుగూరు, భద్రాచలం తదితర ప్రాంతాల నుంచి వందలాది మంది ముస్లిం సోదరులు పాల్గొన్నారు. ర్యాలీలో కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మోరె గణేష్, సీపీఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ భాషతో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా జామా మసీదు కమిటీ అధ్యక్షుడు ఫయాజుల్ హసన్ మాట్లాడుతూ మహా ప్రవక్త మొహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం జననం యావత్ మానవాళికి శాంతి, ప్రేమ, సోదరభావం, సన్మార్గాన్ని చూపిందని అన్నారు. మహా ప్రవక్త బోధించిన మార్గంలో తల్లి పాదాల చెంత స్వర్గం ఉందనే గొప్ప సందేశాన్ని మానవాళికి అందించారని తెలిపారు. మహా ప్రవక్త జన్మానికి ముందు మక్కా నగరంలో ఆడ శిశువులను సజీవంగా సమాధి చేసే దురాచారం ఉండేదని, అది పూర్తిగా తప్పని ప్రపంచానికి తెలియజేసిన మహోన్నత వ్యక్తి మొహమ్మద్ ప్రవక్త అని ఆయన పేర్కొన్నారు. మానవత్వం, సమానత్వం, ప్రేమ, శాంతి వంటి విలువలను ఆయన బోధించారని తెలిపారు.

ఈ సందర్భంగా మతగురువులు కూడా ప్రవక్త బోధనలు, శాంతి, సోదరభావం, మానవత్వం గురించి సందేశాన్ని అందించారు.

కార్యక్రమంలో మర్కజి జామా మసీదు కమిటీ కార్యదర్శి ఇబ్రహీం ఖురేషి, కోశాధికారి మీరా సాహెబ్, కమిటీ సభ్యులు జైనులావుద్దీన్, అక్బర్ అలీ, మస్తాన్ ఖురేషి, అబ్దుల్ రహీం, మతగురువులు రఫీ ఉద్దీన్, సర్ఫరాజ్, ఆలయం ఫరీద్ రజా తదితరులతో పాటు వందలాది మంది ముస్లిం యువకులు పాల్గొన్నారు.

## చేయూత పెన్షన్లపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్న ప్రజా ప్రభుత్వం

**బహుభాషల్లో ఆడియో, వీడియోలు, పాటల రూపంలో ప్రచారం**

హైదరాబాద్: తెలంగాణ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న చేయూత సామాజిక భద్రతా పెన్షన్లకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 31వ తేదీ వరకు అవకాశం ఉందని ప్రభుత్వం వెల్లడించింది. గడువు సమీపిస్తున్న నేపథ్యంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని చేయూత పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకునేలా రాష్ట్రవ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలను చేపడుతోంది. సామాజిక భద్రత, ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న చేయూత పెన్షన్లు అర్హులైన వర్గాలకు ఎంతో తోడ్పాటును అందిస్తున్నాయి. అర్హత ఉన్నప్పటికీ సమాచారం లేకపోవడం లేదా దరఖాస్తు చేసుకోకపోవడం వల్ల ఏ ఒక్కరూ ఈ పథకం ప్రయోజనానికి దూరం కాకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను రూపొందించింది. ఈ ప్రచారంలో భాగంగా మంత్రి సీతక్క ఆదేశాల మేరకు సెర్ప్ (రాజు-రా) ప్రజలకు సులభంగా అర్థమయ్యే రీతిలో చేయూత పెన్షన్లపై అవగాహన కల్పించేలా తెలుగు, హిందీ, ఉర్దూ, ఇంగ్లీష్ భాషల్లో ఆడియోలు, వీడియోలు, పాటలను రూపొందించి విడుదల చేసింది. స్థానిక ప్రజల భాష, యాస, జీవన విధానానికి దగ్గరగా ఉండేలా రూపొందించిన ఈ ప్రచార సామగ్రి ద్వారా చేయూత పెన్షన్ల అర్హత, దరఖాస్తు ప్రక్రియ, చివరి తేదీ తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ ప్రాంతాల్లోనూ అర్హులైన వారందరికీ సమాచారం చేరేలా మీడియా, సామాజిక మాధ్యమాలు, స్థానిక ప్రచార కార్యక్రమాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని సెర్ప్ కోరింది. ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, గ్రామీణ స్థాయి సిబ్బంది కూడా ఈ ప్రచారంలో భాగస్వాములై అర్హులైన వారిని గుర్తించి దరఖాస్తు చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించింది. దరఖాస్తు గడువు ఈ నెల 31వ తేదీతో ముగియనున్నందున అర్హత ఉన్న వారు చివరి తేదీ వరకు వేచి ఉండకుండా వెంటనే దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. అర్హత ఉన్న ఒక్క వ్యక్తి కూడా దరఖాస్తు చేసుకోకుండా మిగిలిపోకుండా ప్రజలు, మీడియా, సామాజిక మాధ్యమాల సహకారంతో అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని ప్రభుత్వం పిలుపునిచ్చింది.

## మానవసేవే మహమ్మద్ ప్రవక్త బోధన

**-మిలాద్ ఉన్ నబి సందర్భంగా పాల్వంచలో మహా అన్నదానం**



**పాల్వంచ ,ఆగస్టు 26 (భద్రాద్రిన్యూస్ ):**
ప్రేమ, శాంతి, సోదరభావం, మానవసేవ అనే మహమ్మద్ ప్రవక్త సందేశాన్ని చాటుతూ మిలాద్ ఉన్ నబి సందర్భంగా పాల్వంచలో మైనారిటీ యూత్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

మైనారిటీ యూత్ అధ్యక్షుడు మాజీద్ ఖురేషి అధ్యక్షతన పాల్వంచ బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని పాల్వంచ ఎస్సై తోట నాగరాజు ప్రారంభించారు. అనంతరం ప్రజలకు భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా మాజిద్ ఖురేషీ మాట్లాడుతూ.... మిలాద్ ఉన్ నబి వేడుకలను సేవా కార్యక్రమాలతో నిర్వహించడం ద్వారా మహమ్మద్ ప్రవక్త బోధనలను సమాజానికి చేరువ చేయవచ్చన్నారు. కులమతాలకు అతీతంగా పరస్పర ప్రేమ, సోదరభావంతో జీవించాలనే సందేశంతో అన్నదానం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో మైనారిటీ యూత్ సభ్యులు కలీం, ఖాసిం బాబా, మజహార్, ఉస్మాన్ ఖాన్ హలీల్ ఉరేషి ఆరిఫ్ హలీల్ మౌలానా జూపల్లి దుర్గాప్రసాద్ సన్లోత్ రంజిత్ అమీర్ షఫీ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా డిసిసి ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్ కమిటీ చైర్మన్ నరసింహా రెడ్డి జన్మదిన వేడుకలు

**అనాథ పిల్లలకు అన్నదానం**
**డిసిసి అధ్యక్షుడి నివాసంలో కేక్ కట్టింగ్**

హనుమకొండ జిల్లా కిసాన్ కాంగ్రెస్ చైర్మన్, డిసిసి ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్ కమిటీ చైర్మన్ పింగిలి వెంకట్రామ్ నరసింహ రెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం హనుమకొండలో ఘనంగా జరిగాయి. ఆయన పుట్టినరోజును పురస్కరించుకుని బాలసముద్రంలోని 'మల్లికాంబ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెంటల్లీ హ్యాండీక్యాప్డ్ అండ్ డిసేబిలిటీస్' ఆశ్రమంలోని చిన్నారులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సేవా కార్యక్రమానికి హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, చిన్నారులకు స్వహస్తాలతో అన్నదానం చేశారు. అనంతరం, డిసిసి అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి నివాసంలో పింగిలి వెంకట్రామ్ నరసింహ రెడ్డి చేత కేక్ కట్ చేయించి, కాంగ్రెస్ శ్రేణుల మధ్య జన్మదిన వేడుకలను ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ.. పింగిలి వెంకట్రామ్ నరసింహ రెడ్డి మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. సేవా కార్యక్రమాలతో పాటు పార్టీ శ్రేణుల మధ్య జన్మదినాన్ని జరుపుకోవడం సంతోషకరమన్నారు. అంతకుముందు, జన్మదినాన్ని పురస్కరించుకుని చారిత్రాత్మక హనుమకొండ భద్రకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ వేడుకల్లో వర్ధన్నపేట నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు, మండల అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొని పింగిలి వెంకట్రామ్ నరసింహ రెడ్డి కి పూలమాలలు, శాలువాలతో జన్మదిన శుభాకాంక్షలుతెలియజేశారు.

# అగస్టు 31 న జరిగే మాలల ఛలో సెక్రటేరియట్ ను విజయవంతం చేయండి!

**పిల్లి సుధాకర్, రాష్ట్ర అధ్యక్షులు**
**జాతీయ మాలమహానాడు తెలంగాణ**
**ఛలో సెక్రటేరియట్ కరపత్రాల ఆవిష్కరణ**



మాలలకు విద్య, ఉద్యోగ అవకాశాల్లో జరుగుతున్న అన్యాయాన్ని నివారించేందుకు రోస్టర్ విధానాన్ని సవరించాలని జాతీయ మాల మహానాడు డిమాండ్ చేసింది. ఈ నెల 31న 'చలో సెక్రటేరియట్' కార్యక్రమం నిర్వహించనున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ తెలిపారు. హన్మకొండ అంబేద్కర్ విగ్రహం ముందు కరపత్రం ఆవిష్కరణ కార్యక్రమ సమావేశంలో "చలో సెక్రటేరియట్" కు సంబంధించిన వాల్ పోస్టర్ ను ఆయన పలువురు నాయకులతో కలిసి విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాలలకు కేటాయించిన 5 శాతం రిజర్వేషన్ పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని వారు ఆరోపించారు. ప్రభుత్వం జారీ చేసిన జీఓ 99లో మాలలకు రోస్టర్ పాయింట్ల కేటాయింపుపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ, 20 పాయింట్లలోపు రెండు పాయింట్లు మాలలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. మాల విద్యార్థులు, ఉద్యోగులు, మేధావులు పెద్ద సంఖ్యలో చలో సెక్రటేరియట్ కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈసమావేశంలో అగస్టు 31 న జరిగే మాలల ఛలో సెక్రటేరియట్ ను విజయవంతం చేయాలని హనంకొండ జిల్లా అధ్యక్షుని ఆధ్వరంలో హనంకొండ జిల్లాలో కరపత్రం ఆవిష్కరణ హనంకొండ అంబేద్కర్ విగ్రహం దగ్గర ప్రెస్ మీట్ ఛలో సెక్రటేరియట్ కరపత్రాల ఆవిష్కరణ, మాలలకు విద్య, ఉద్యోగ అవకాశాల్లో జరుగుతున్న అన్యాయాన్ని నివారించేందుకు రోస్టర్ విధానాన్ని సవరించాలని జాతీయ మాల మహానాడు డిమాండ్ చేసింది. ఈ నెల 31న 'చలో సెక్రటేరియట్' కార్యక్రమంలి నిర్వహించనున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ తెలిపారు, హన్మకొండ అంబేద్కర్ విగ్రహం వద్ద జిల్లా అద్యక్షులు పనికల శ్రీనివాస్ అద్యక్షతన ఏర్పాటు చేసిన కరపత్ర ఆళహవిష్కరణ సమావేశంలో "చలో సెక్రటేరియట్" కు సంబంధించిన వాల్ పోస్టర్ ను ఆయన పలువురు నాయకులతో కలిసి విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాలలకు కేటాయించిన 5 శాతం రిజర్వేషన్ పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని వారు ఆరోపించారు. ప్రభుత్వం జారీ చేసిన జీఓ 99లో మాలలకు రోస్టర్ పాయింట్ల కేటాయింపుపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ, 20 పాయింట్లలోపు రెండు పాయింట్లు మాలలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. మాల విద్యార్థులు, ఉద్యోగులు, మేధావులు పెద్ద సంఖ్యలో చలో సెక్రటేరియట్ కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈసమావేశంలో జాతీయ ప్రధాన కార్యదర్శి భైరి రమేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి అంజయ్య, రాష్ట్ర అదికార ప్రతినిధి నీరటి రాములు,వరంగల్, హన్మకొండ జిల్లా అద్యక్షులు పనికల శ్రీనివాస్, యవత జిల్లా అద్యక్షులు ఉసిల్ల ఉదయ్, నాయకులు బన్న ప్రభాకర్, రామిండ్ల బాబురావు, పడుగుల నర్సయ్య, సంపతి రఘు, సాదు కుమార స్వామి, రౌతు రాజేందర్, గరిగ రాజ్ కుమార్, పప్పుల గంగాదర్, ఉసిల్ల పూర్ణ రాంచందర్,, గోపుల చిన్న, సంపతి చిన్న,దామెర నవీన్, సంపతి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# కల్పనా చౌదరికి ఆదాబ్ హైదరాబాద్ ఘన సత్కారం

**సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా ఆత్మీయ సత్కారం**

**హైదరాబాద్, ఆగస్టు 26 (భద్రాద్రిన్యూస్) :**




కొల్లి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్పనా చౌదరికి 'ఆదాబ్ హైదరాబాద్' ఆధ్వర్యంలో ఎక్సెలెన్స్ అవార్డు--2026ను ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. చిన్నారుల భవిష్యత్తు, మహిళల సాధికారత, వృద్ధుల సంక్షేమం, సమాజ అభివృద్ధి కోసం కల్పనా చౌదరి చేస్తున్న నిరంతర సేవలను గుర్తిస్తూ ఈ సత్కారం నిర్వహించారు. అధికార దర్పాలు, హోదాల ప్రాభవాలకు దూరంగా ఉంటూ సమాజ సేవకే ప్రాధాన్యం ఇస్తూ, అనేక సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న ఆమె సేవా దృక్పథాన్ని నిర్వాహకులు కొనియాడారు. చిన్నారులకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించడం, మహిళలు స్వయం సాధికారత సాధించేలా ప్రోత్సహించడం, వృద్ధులకు అండగా నిలవడం, నిరుపేదలకు చేయూత అందించడం వంటి కార్యక్రమాల ద్వారా కల్పనా చౌదరి తనదైన సేవా ముద్రను చాటుతున్నారని తెలిపారు. "సమాజ శ్రేయస్సే ధ్యేయంగా.. సేవనే మార్గంగా" ఎంచుకుని పనిచేస్తున్న కల్పనా చౌదరి వ్యక్తిత్వం ఎంతో మందికి స్ఫూర్తిదాయకమని నిర్వాహకులు పేర్కొన్నారు. సున్నితమైన మనసుతో పాటు విశాల దృక్పథంతో సామాజిక సమస్యల పరిష్కారానికి ఆమె చేస్తున్న కృషికి గుర్తింపుగా సత్కారం అందించడం తమకు గర్వకారణమన్నారు.

'ఆదాబ్ హైదరాబాద్' పత్రిక 15వ వార్షికోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఏర్పాటు చేసిన సభలో కల్పనా చౌదరికి ఆత్మీయ స్వాగతం పలికిన నిర్వాహకులు, ఆమెను ఘనంగా సన్మానించారు. సమాజంలో సానుకూల మార్పులకు కృషి చేస్తున్న సేవా సంస్థలు, వ్యక్తులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా నిర్వాహకులు పేర్కొన్నారు. కల్పనా చౌదరి సేవా కార్యక్రమాలు మరింత విస్తరించి, మరెందరో నిరుపేదలు, మహిళలు, చిన్నారులు, వృద్ధులకు ప్రయోజనం చేకూరాలని పలువురు ఆకాంక్షించారు.

# అడవి ఆహారాలు.. ఔషధ మూలికలకు శాశ్వత రక్షణ

**కాఫెడ్ స్వచ్ఛంధ సంస్థ అధ్వర్యంలో పెంకవాగులో అడవి ఆహార పదార్థాలు మరియఔషధ మూలికలపై సాంప్రదాయ జ్ఞాన నమోదు.**

**వెంకటాపురం భద్రాద్రి న్యూస్ ఆగస్టు26,**

ములుగు జిల్లా వెంకటాపురం మండలం తిప్పాపురం పంచాయతీ పరిధిలో లో గల పెంకవాగు గ్రామంలో కమ్యూనిటీ హాల్ లో అడవి ఆహార పదార్థాలు మరియు ఔషధ మూలికలపై సాంప్రదాయ జ్ఞాన డాక్యుమెంటేషన్ పైన అవగాహన సదస్సు ఏర్పాటు చేయటం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఫ్ బి ఒ అశ్విని ఫ్ స్ ఓ చంద్రమోహన్ సర్పంచ్ చందా శిరీష పాల్గొన్నారు. అశ్విని మాట్లాడుతూ అడవి ఆహార పదార్థాలు మరియు ఔషధ మూలికలు గ్రామీణ, గిరిజన సమాజాల జీవన విధానంలో ముఖ్యమైన భాగంగా ఉన్నాయి. తరతరాలుగా ప్రజలు అడవిలో లభించే వివిధ ఆకులు, కాయలు, పండ్లు, వేర్లు, గింజలు మరియు ఇతర సహజ వనరులను ఆహారంగా ఉపయోగిస్తూ వస్తున్నారు. అదేవిధంగా, స్థానికంగా లభించే ఔషధ మొక్కల ఉపయోగం, వాటి గుర్తింపు, సేకరణ మరియు సంప్రదాయ వినియోగంపై విలువైన జ్ఞానం సమాజంలో ఉంది. ఈ అధ్యయనం యొక్క ప్రధాన ఉద్దేశ్యం స్థానిక ప్రజల్లో ఉన్న అడవి ఆహారాలు మరియు ఔషధ మూలికలకు సంబంధించిన సాంప్రదాయ జ్ఞానాన్ని సేకరించి, పద్ధతిగా నమోదు చేయడం. ఈ జ్ఞానాన్ని భవిష్యత్ తరాలకు అందుబాటులో ఉంచడంతో పాటు, జీవవైవిధ్య పరిరక్షణ మరియు స్థానిక సాంస్కృతిక వారసత్వ పరిరక్షణకు దోహదపడటం ఈ డాక్యుమెంటేషన్ యొక్క ముఖ్య లక్ష్యం. ఈ కార్యక్రమానికి వెంకటాపురం మండల కోఆర్డినేటర్ జి హనుమంత్ వాజేడు మండల కోఆర్డినేటర్ జి కామేష్ యానిమేటర్స్ ప్రశాంత్ నరేష్ ఉషా ఇందిరా పద్మ గ్రామస్థులు పాల్గొన్నారు.




# ఆగస్టు 27న అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో గ్రామ, వార్డు సభలు

**ఓటరు జాబితాలో పేర్లు, వివరాలను సరిచూసుకోవాలి**
**: జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్ధడే హేమంత్ సహదేవరావు**
**భద్రాద్రి న్యూస్ ములుగు**

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ఆగస్టు 27న జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో గ్రామసభలు, వార్డుసభలు నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్ధడే హేమంత్ సహదేవరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ సభల్లో సంబంధిత పోలింగ్ కేంద్ర స్థాయి అధికారులు తమ పరిధిలోని ఓటరు జాబితాలను ప్రజల సమక్షంలో చదివి వినిపిస్తారని పేర్కొన్నారు. ఓటర్లు తమ పేరు, చిరునామా, ఇతర వివరాలు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించుకునేందుకు అవకాశం కల్పిస్తారని తెలిపారు.

అర్హులైన పౌరులు ఓటరు జాబితాలో కొత్తగా పేరు నమోదు చేసుకునేందుకు దరఖాస్తు నమూనా--6, పేరు తొలగింపు లేదా అభ్యంతరాల కోసం నమూనా--7, వివరాల సవరణ కోసం నమూనా--8ను వినియోగించుకోవాలని సూచించారు. ఆచూకీ లేని, ఇతర ప్రాంతాలకు వెళ్లిన, మరణించిన, రెండు చోట్ల నమోదైన ఓటర్ల జాబితాలను కూడా గ్రామ, వార్డు సభల్లో ప్రజల పరిశీలనకు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. అందులో ఏవైనా తప్పులు ఉన్నట్లు గుర్తిస్తే తగిన ఆధారాలతో సవరణకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ జాబితాలతోపాటు అసంగత వివరాలు ఉన్న, గత ఓటరు జాబితాతో అనుసంధానం కాని ఓటర్ల వివరాలను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు అందుబాటులో ఉంచి ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో పారదర్శకత పాటించనున్నట్లు వెల్లడించారు.



అసంగత వివరాలు ఉన్న, గత ఓటరు జాబితాతో అనుసంధానం కాని ఓటర్లకు నోటీసుల జారీ ప్రక్రియ ప్రారంభమైందని కలెక్టర్ తెలిపారు. సంబంధిత పోలింగ్ కేంద్ర స్థాయి అధికారి ద్వారా ఓటరుకు లేదా వారి కుటుంబ సభ్యులకు నోటీసులు అందజేస్తారని పేర్కొన్నారు. నోటీసులో తెలిపిన తేదీ, సమయం, ప్రదేశంలో ఓటరు స్వయంగా విచారణకు హాజరై అవసరమైన అసలు ధ్రువపత్రాలను చూపించాలని సూచించారు. ఆగస్టు 27 నుంచి సెప్టెంబర్ 20 వరకు సమీప గ్రామ పంచాయతీ భవనం లేదా వార్డు కార్యాలయంలో విచారణలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

నోటీసులు అందుకున్న ఓటర్లు ఎన్నికల నమోదు అధికారి లేదా సహాయ ఎన్నికల నమోదు అధికారి ఎదుట హాజరై ధ్రువపత్రాలను సమర్పించవచ్చని పేర్కొన్నారు. భారత ఎన్నికల సంఘం ఓటర్ల సేవల అంతర్జాల వేదిక ద్వారా కూడా సంబంధిత పత్రాలను ముందుగానే జతచేయవచ్చని తెలిపారు.

2026 అక్టోబర్ 1వ తేదీని అర్హత తేదీగా నిర్ణయించినట్లు కలెక్టర్ తెలిపారు. 1987 జూలై 1కి ముందు జన్మించిన వారు ఎన్నికల సంఘం గుర్తించిన ధ్రువపత్రాల్లో ఏదైనా ఒకటి సమర్పించాలని పేర్కొన్నారు. 1987 జూలై 1 నుంచి 2004 డిసెంబర్ 2 మధ్య జన్మించిన వారు తమ ధ్రువపత్రంతోపాటు తల్లి లేదా తండ్రికి సంబంధించిన ధ్రువపత్రాల్లో ఏదైనా ఒకటి అందజేయాలని తెలిపారు. 2004 డిసెంబర్ 2 తరువాత జన్మించిన వారు తమ ధ్రువపత్రంతోపాటు తల్లిదండ్రులిద్దరి ధ్రువపత్రాలను సమర్పించాలని సూచించారు. శాశ్వత నివాస, అటవీ హక్కులు, కుల, జనన ధ్రువపత్రాలు, కుటుంబ నమోదుపత్రం, ప్రభుత్వ భూమి లేదా గృహ కేటాయింపు పత్రం, ఆధార్ కార్డు, పాస్‌పోర్టు, పదో తరగతి లేదా ఇతర విద్యార్హత పత్రాలను సమర్పించవచ్చని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగ గుర్తింపు కార్డు, పింఛను చెల్లింపు ఆదేశ పత్రం, జాతీయ పౌరుల నమోదుపత్రంతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు, బ్యాంకులు, తపాలా కార్యాలయాలు, జీవిత బీమా సంస్థలు జారీ చేసిన గుర్తింపు పత్రాలను కూడా పరిగణనలోకి తీసుకుంటారని పేర్కొన్నారు. 2002 ప్రత్యేక సమగ్ర సవరణ జాబితాతో వివరాలు సక్రమంగా అనుసంధానమైన ఓటర్లు అదనపు ధ్రువపత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదని తెలిపారు. ఆగస్టు 10లోగా గణన పత్రాన్ని సమర్పించని వారు దావాలు, అభ్యంతరాల స్వీకరణ కాలంలో దరఖాస్తు నమూనా--6తోపాటు నిర్ణీత ప్రకటన పత్రాన్ని అందజేయవచ్చని పేర్కొన్నారు.ప్రజలు ఓటరు జాబితాలో తమ పేరు, చిరునామా, ఇతర వివరాలను తప్పనిసరిగా సరిచూసుకోవాలని కలెక్టర్ కోరారు. పేరు నమోదు కాకపోయినా, వివరాల్లో తప్పులు ఉన్నా సవరణకు కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ ప్రక్రియపై సందేహాలు లేదా సమస్యలు ఉంటే దూరవాణి సంప్రదింపుల నమోదు సేవ, జాతీయ ఓటరు సేవల ఫిర్యాదుల అంతర్జాల వేదిక ద్వారా లేదా 1950 ఉచిత సహాయ సంఖ్యను సంప్రదించి నివృత్తి చేసుకోవచ్చని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్ధడే హేమంత్ సహదేవరావు తెలిపారు.



# అవినీతి వ్యవసాయం

మొదటి పేజీ తరువాయి

ములుగు జిల్లా వ్యవసాయ శాఖలో ఓ మారుమూల మండలంలో పనిచేస్తున్న వ్యవసాయాధికారి పని తీరుపై విమర్శలు వెలివెత్తుతున్నాయి. ఈ అధికారి రైతుల ప్రయోజనాల కంటే స్వప్రయోజనాలపైనే ప్రత్యేకంగా దృష్టి పెట్టి పనిచేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. మండలంలో సమగ్ర వ్యవసాయ అభివృద్ధి కోసం రైతులకు అందుబాటులో ఉంటూ సలహాలు సూచనలు ఇవ్వాల్సిన బాధ్యతను ఈ ఏవో విస్మరిస్తున్నారట .. ఏజెన్సీ లోనే మామూలుగా ఆ మండలంలో పదుల సంఖ్యలో ఉన్న ఎరువులు పురుగుమందుల షాపుల మాటున ఆయన చేస్తున్న వసుళ్ళ పర్వంపై అనేక విమర్శలు ఉన్నాయి. కొత్తగా లైసెన్స్ తీసుకోవాలన్న పాత షాపులు రెన్యువల్స్ చేసుకోవాలన్న ఈ అధికారి చేతులు తలపాల్సిందే. ఫెర్టిలైజర్ షాపుల వద్ద నుండి భారీగా వసూళ్లకు పాల్పడుతున్నా రంటూ ఈ వ్యవసాయ అధికారిపై తీవ్రమైన ఆరోపణలు ఉన్నాయి. తనకున్న హోదా పరంగా వచ్చిన విలువైన సంతకాన్ని సైతం తాకట్టు పెట్టే దిశగా ఈ అధికారి వ్యవరిస్తున్నారట. ఏజెన్సీలోని విద్యార్థులకు అవసరమైన గెజిటెడ్ సంతకం కోసం కూడా ఈ సార్ ఒక రేటును నిర్ణయించారట. పేద పిల్లలకి అవసరమైన సంతకాని సైతం తాకట్టు పెడుతున్న ఈ అధికారి తీరును క్షమించాల్సిన అవసరం ఉందం టారా..? రైతుల ప్రయోజనాలను ఏమాత్రం పట్టించుకోకుండా అడ్డదారి వ్యవహారాల్లో నిమగ్నమవుతున్న ఈ అధికారిపై ఆ శాఖ ఉన్నతాధికారులు విచారణ చేస్తే అనేక నిజాలు వెలుగులోకి వస్తాయట

# రూ.4.46 కోట్లతో అభివృద్ధి జాతర



**భద్రాద్రి న్యూస్ ములుగు జిల్లా**

గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటిసరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు.

బుధవారం తాడ్వాయి, ఏటూరునాగారం మండలాల్లో 4 కోట్ల 46 లక్షల రూపాయలతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు మంత్రి సీతక్క ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు.

తాడ్వాయి వ్యవసాయ మార్కెట్ యార్డులో 83 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు.

అనంతరం సీఆర్ఆర్--ప్లెయిన్ 2025--26 నిధులతో ఏటూరునాగారం మండలం శివాపూర్ గ్రామంలో 80 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్డు, సీసీ డ్రైన్లను ప్రారంభించారు. శివాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని గోగుపల్లిలో 55 లక్షల రూపాయలతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్డును ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు.

అనంతరం ఏటూరునాగారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్కెట్ కమిటీ నిధులు 2 కోట్ల 28 లక్షల రూపాయలతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంల్లో మంత్రి సీతక్క మాట్లాడుతూ, మారుమూల గ్రామాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. రహదారులు, మురుగునీటి కాలువల నిర్మాణంతోపాటు వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో వసతుల కల్పనకు అవసరమైన నిధులను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటిస్తూ నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమాల్లో గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ రఘు, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.